## గంజాయి కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్

**• సీఐ నాగబాబు**



**టీ.మీడియా,ఏప్రిల్28 , అశ్వాపురం:** న్యూ పద్మగూడెం గ్రామంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1.085 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు సీఐ నాగబాబు నేతృత్వంలో పోలీసులు అనుమానిత ఇంటిలో తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఇంటి యజమాని మిడియం గోవిందును విచారించగా, గుట్టమల్లారానికి చెందిన సాయి అలియాస్ గుట్ట సాయి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. అలాగే సత్తుపల్లికి చెందిన జుజునూరి సింహాద్రి అలియాస్ సందీప్‌కు గంజాయి అమ్ముతున్నట్లు వెల్లడైంది. ఈ మేరకు మిడియం గోవిందు, గుట్ట సాయి, జుజునూరి సింహాద్రి అలియాస్ సందీప్‌లపై కేసు నమోదు చేసి, మిడియం గోవిందును జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగబాబు మీడియాకు తెలిపారు. మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.


Digital, tmedia.net.in

# టీ-మీడియా

www.tmedia.net.in
ANNIVERSARY Celebration

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 104
సంచిక : 227
పేజీలు : 3
బుధవారం, ఏప్రిల్ 29, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN


# ఇందిరా మహిళ డెయిరీ విజయవంతానికి ప్రణాళిక

**• జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**

**టి మీడియా, ఏప్రిల్ 28, ఖమ్మం:** ఇందిరా మహిళా డెయిరీని విజయవంతం చేసేందుకు విజయ డెయిరీ నమూనాను అనుసరిస్తూ సమగ్ర ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు.జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమంపై అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) డాక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూలి ఇందిరా మహిళా డెయిరీ అమలులో వ్యవస్థీకృత విధానాన్ని అనుసరించాలని సూచించారు. విజయ డెయిరీ ప్రతినిధులను కూడా ఆ బోర్డులో భాగస్వామ్యం చేయాలని తెలిపారు. దీనివల్ల మహిళా సంఘాలకు ప్రయోజనం చేకూరడమే కాకుండా, కార్యక్రమం సమర్థవంతంగా నడుస్తుందని అన్నారు.ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను విజయ డెయిరీ సేకరిస్తుండగా, ఇందిరా మహిళా డెయిరీ ద్వారా దశల వారీగా 40 వేల లబ్ధిదారులకు పశువులు పంపిణీ చేసి, రోజుకు 80 వేల లీటర్ల పాలు సేకరించే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు.విజయ డెయిరీ నమూనాను ప్రతిరూపంగా తీసుకుని, అవసరమైన విధంగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, రిటైర్డ్ ఉద్యోగుల మార్గదర్శకత్వాన్ని వినియోగించు కోవాలని సూచించారు. శాఖల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, ప్రతి నిర్ణయాన్ని లిఖిత పూర్వకంగా అమలు చేయాలని ఆదేశించారు.ఎంఎన్ఆర్ఈజీఏ నిధులను లబ్ధిదారుల పశువుల షెడ్ల నిర్మాణానికి వినియోగించే విధంగా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. పశువుల కొనుగోలు లబ్ధిదారుల ఆమోదంతోనే జరగాలని, కొనుగోలు మార్గదర్శకాలపై ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.బీఎంయూ స్థాయిలో విజయ డెయిరీ సిబ్బంది నమూనాను అనుసరించి, అదే విధానాన్ని ఇందిరా మహిళా డెయిరీలో అమలు చేయాలని, మహిళలు వివిధ బాధ్యతలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. లబ్ధిదారులకు సబ్సిడీ మొత్తాన్ని సకాలంలో జమ చేయడానికి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని, లబ్ధిదారుల కోసం నాన్-ఆపరేటివ్ బ్యాంక్ ఖాతాలను ప్రారంభించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.రాష్ట్రానికి రోజు ఇతర రాష్ట్రాల నుంచి అనేక లీటర్ల పాలు దిగుబడి అవుతున్నాయని, వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరా మహిళా డెయిరీ పశువుల పంపిణీ ద్వారా ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే పాలను సమర్థవంతంగా సేకరించేలా అవసరమైన



ఒప్పందాలు కుదుర్చుకుని, దశలవారీగా పాల ఉత్పత్తిని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ,ఇందిరా మహిళా డెయిరీ ప్రాజెక్టు అమలు విధానంపై వివరాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ప్రాజెక్టు విజయవంతం కోసం అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో డి.ఆర్.డి.ఓ., ట్రైబల్ వెల్ఫేర్, బిసి, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, ఏపిఎం., సంబంధిత మండల ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**టి మీడియా, ఏప్రిల్ 28, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లాలో నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 ప్రవేశ పరీక్షను ఎలాంటి లోపాలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు కచ్చితంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మే 3వ తేదీ



(ఆదివారం) మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 1078 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా, ఇందుకోసం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగరేణి ఉమెన్స్ కళాశాల, శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల, నవభారత్ ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఎదురుగా గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పరీక్షా

మిగతా 3లో

# మామిళ్లగూడెం మృత్యుఘోష..

**నిన్న తండ్రి, కూతురు.. నేడు తల్లి.**

**టి మీడియా, ఏప్రిల్ 28, ఖమ్మం :** నగరంలోని మామిళ్లగూడెంలో చోటుచేసుకున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి ఉదంతం ఇప్పుడు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. తొలుత తండ్రి రాము, కుమార్తె దివ్యశ్రీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, తాజాగా ఈ కేసులో మరో విషాదకర మలుపు చోటుచేసుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్య రమ్య కూడా మంగళవారం (ఏప్రిల్ 28) కన్నుమూసింది.రెండు రోజుల క్రితం రాము, దివ్యశ్రీ విగతజీవులుగా పడి ఉండగా.. రమ్య, చిన్న కుమార్తె రితిక అపస్మారక స్థితిలో కనిపించారు. ఈ కేసును ఛేదించేందుకు రమ్య వాంగ్మూలం అత్యంత కీలకం అవుతుందని పోలీసులు భావించారు. సోమవారం ఉదయం ఆమె స్పృహలోకి వచ్చినట్లు కనిపించినా, పోలీసులు ప్రశ్నించినప్పుడు పొంతన లేని సమాధానాలు చెప్పింది. సాయంత్రానికి ఆమె ఆరోగ్యం క్షీణించి మరణించడంతో కేసు దర్యాప్తు క్లిష్టంగా మారింది.ప్రస్తుతం మూడేళ్ల చిన్నారి రితిక మాత్రమే ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మరణాలకు గల కారణాలపై

మిగతా 3లో








## జర్నలిస్టు హత్యపై కొవ్వొత్తుల నిరసన

**టీ.మీడియా,ఏప్రిల్28 ,చింతూరు:**చిత్తూరు జిల్లాలో ఆంధ్రజ్యోతి విలేకరిని దారుణంగా హతమార్చిన ఘటనపై చింతూరు ప్రాంత జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ చింతూరు డివిజన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, మన్యం రిపోర్టర్ సత్యా యాదవ్ మాట్లాడుతూ జర్నలిస్టుపై జరిగిన హత్య ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే ఘటన అని తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృత జర్నలిస్టు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే పాత్రికేయుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని వారు అన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ చింతూరు డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎస్కే ఇబ్రహీం, డివిజన్ నాయకులు మరియు పలువురు జర్నలిస్టులు పాల్గొని మృత విలేకరికి నివాళులర్పించారు.



## మే డే, ఐఎన్‌టియుసి ఆవిర్భావ సభజయప్రదం చేయండి

**కొత్తసీతారాములు జిల్లా ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు**

**టీ మీడియా, ఏప్రిల్ 28, ఖమ్మం :**

ఖమ్మం స్థానిక సంజీవరెడ్డి భవనము లో నగర ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు నరాల నరేష్ మోహన్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అలాగే మే -03 న జరగబోయే ఆవిర్భావ సభ కు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కార్మికులు మరియు అనుబంధ సంఘాల అధ్యక్షులు ,నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి జిల్లా నాయకులు ఎస్వీ రమణ , హమాలీ సంఘం అధ్యక్షులు కలిమెల భద్రం , నగర ప్రధాన కార్యదర్శి కొంగరి సంగయ్య ,ఉపాధ్యక్షులు సిద్దాల నగేష్ , ఫజల్ , దడవాయి సంఘం అధ్యక్షులు రాజేష్, మోటార్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పాల్వంచకృష్ణ మున్సిపల్ కార్పొరేషన్ నాయకులు పాషా జ్యోతి , కృష్ణ , నాగరాజు , కార్యదర్శి పోతగాని రమణ కుమార్ఆటో యూనియన్ జిల్లా మరియు నగర అధ్యక్షులు వీరేందర్ రెడ్డి తోట సైదులు మిషన్ భగీరథ నాయకులు బాలకృష్ణ , జోగారావు , సుతారి యూనియన్ నాయకులు వీరేశం , యఫ్ సి ఐ నాయకులు బంగారి, మురళి , పాల్గొన్నారు

## కొణిజర్ల మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం.

**- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు.**



**టీ మీడియా ఏప్రిల్ 28 కొణిజర్ల.**

మండల పరిధిలోని పెద్దమనగాల గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలవగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దమనగాల గ్రామానికి చెందిన తుప్పత్తి సత్యనారాయణ (34), చింతల కేశవులు (40) కలిసి డీజిల్ కోసం బైక్‌పై పెద్ద గోపతి గ్రామానికి బయలుదేరారు.సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కనుమతి రెడ్డి వెంకట్ రెడ్డి వ్యవసాయ భూమి వద్దకు చేరుకోగానే, ఎదురుగా పెద్దగోపతి వైపు నుండి వస్తున్న మరో మోటార్ సైకిల్ (టీఎస్20బీ1971) వీరిని బలంగా ఢీకొట్టింది. రాజారపు నారాయణ అనే వ్యక్తి తన బైక్‌కు లైట్లు లేకుండా, అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.ఈ ఘటనలో సత్యనారాయణ తలకు బలమైన గాయం కాగా, కేశవుల కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే వారిని ఖమ్మంలోని ప్రశాంతి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున 1:42 గంటలకు తుప్పత్తి సత్యనారాయణ మృతి చెందారు. మృతుడి భార్య తుప్పత్తి త్రివేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొణిజర్ల ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# దరిపల్లి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




**టీ మీడియా ,ఏప్రిల్ 28 , ఖమ్మం:**దరిపల్లి అనంత రాములు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (పాలిటెక్నిక్, బీటెక్, ఎంబీఏ)లో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ మహిళా భద్రత విభాగం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ఖమ్మం షీ టీం ఎస్సై జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు తమ వయస్సుకు తగిన విధంగా ప్రవర్తిస్తూ, ప్రస్తుత చట్టాలకు అనుగుణంగా మెలగాలని సూచించారు. క్రమశిక్షణతో కూడిన జీవన విధానం భవిష్యత్తు విజయానికి కీలకమని ఆమె తెలిపారు.కానిస్టేబుల్ సుధారాణి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో చట్టాలు కఠినంగా అమలవుతున్న నేపథ్యంలో విద్యార్థులు అపరిచిత వ్యక్తులతో పరిసరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా హెల్ప్‌లైన్ కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా కానిస్టేబుల్ భాస్కర్ మరియు యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ గారు విద్యార్థులతో మమేకమై, చట్ట పరిధిలో ఏది సరికాదు, ఏది సరైనది అనే అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.కళాశాల అధిపతి డాక్టర్ దరిపల్లి కిరణ్ గారు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో చట్టాల పట్ల అవగాహనతో పాటు మంచి ప్రవర్తనను అలవరచుకోవడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థి దశలో అలవాటు చేసుకునే క్రమశిక్షణ, సమయపాలన మరియు నైతిక విలువలు వారి భవిష్యత్తును నిర్మిస్తాయని తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే బాధ్యతగల పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దరిపల్లి కిరణ్, కరస్పాండెంట్ దరిపల్లి స్వాతి, అకాడమిక్ ఇన్‌చార్జ్ చైతన్య, ఎన్‌సీసీ కేర్‌టేకర్, ఏవో చిరంజీవి, విభాగాధిపతులు ప్రవీణ్ కుమార్, మానస, సద్దాఫ్, శ్రీను, రవి కుమార్, శ్రీనివాస్, విజయ భవాని బోధనేతర సిబ్బంది ప్రసన్నలక్ష్మీ, రేహమతి, రామయ్య మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

# .నేడు పాలేరు ప్రజా దర్బార్

**టీ మీడియా ,ఏప్రిల్ 28 ,కూసుమంచి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజా దర్బార్ బుధవారం అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రం పాలేరులో జరుగునుంది. ఉదయం 8 .00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా దర్బార్ మధ్యాహ్నం 1.00 గంటల వరకు కొనసాగునుంది. రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వయంగా పాల్గొను ప్రజాదర్బారులో ప్రజా సమస్యలు కొన్నింటిని అక్కడకక్కడే పరిష్కారం చేస్తారు.ఈ దర్బారులో ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు పాల్గొంటారు.

పాలేరు క్లస్టర్ కేంద్రంలో జరుగు ప్రజా దర్బార్ సభలో జుజ్జుర్లరావుపేట ,నాయకుని గూడెం రాజుపేట, ఈశ్వర్ మాదారం ,మల్లాయగూడెం, గొర్లపాడు తండా, నర్సింహులగూడెం ,కొత్తూరు ,ఎర్రగడ్డ తండా ,మళ్ళాయి గూడెం ,చౌటపల్లి ,బుడియ తండా ,భాగవత్ తండా ,సహా 15 గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం కొరకు వినతులు సమర్పించవచ్చు.

**ఆరెంపుల క్లస్టర్లు ప్రజా దర్బార్ ...**

ఖమ్మం రూరల్ మండలం ఆరెంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మరో దర్బార్ నిర్వహించనున్నారు. ఈ కేంద్రానికి ఆరెంపుల, చింతపల్లి, కొండాపురం, అరేకోడు, అరేకోడు తండా, పొన్నేకల్, తల్లంపాడు, ఎం. వెంకటాయపాలెం, కస్నాతండా, కాచిరాజుగూడెం, తనగంపాడు, గూడూరుపాడు మొత్తం 12 గ్రామాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కు హాజరు కావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్చార్జి కోరారు.

# ఇందిరా డైరీ పనుల్లో నాణ్యత పాటించాలి

**మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర పర్యటన**

**అభివృద్ధి పనుల పురోగతిపై ఆకస్మిక తనిఖీ**

**టీ మీడియా, ఏప్రిల్ 28, ముదిగొండ:** మండలంలో ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన, ప్రభుత్వ పథకాల అమలు తీరును స్వయంగా పర్యవేక్షించారు. ముఖ్యంగా మండలంలో నిర్మిస్తున్న ఇందిరా డైరీని సందర్శించిన కలెక్టర్, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. డైరీ ఏర్పాటుకు సంబంధించిన నిధుల వినియోగం, ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలపై అధికారులను ప్రశ్నించారు. డైరీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, నిర్మాణంలో ఎక్కడా నాణ్యత లోపించకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామాల్లో మౌలిక వసతులపై కలెక్టర్ సమీక్షించారు. రహదారుల పరిస్థితి, వేసవిలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# రికార్డు సృష్టించిన బుర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రి

**టీ.మీడియా,ఏప్రిల్28 ,బూర్గంపాడు:** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో బుర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రి మరో ముందడుగు వేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బుర్గంపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గత ఒక సంవత్సరం కాలంలో వంద కుటుంబ నియంత్రణ (ట్యూబెక్టమీ) శస్త్రచికిత్సలు నిర్వహించి రికార్డు సృష్టించారు.నాడు ప్రతి చిన్న ఆరోగ్య సమస్య కి భద్రాచలం ఆసుపత్రికి వెళ్ళే స్థాయి నుండి అతి తక్కువ సమయంలోనే రికార్డ్ స్థాయిలో శస్త్రచికిత్స లు చేసే స్థాయికి బుర్గంపాడు ఆసుపత్రి చేరుకుంది. 14-15 సంవత్సరాలుగా ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో ఈ ఆసుపత్రి ప్రాథమిక వైద్య సేవలకే పరిమితమైంది. అంతేకాక పాత ఆసుపత్రి భవనం కారణంగా సేవలు మరింత పరిమితమయ్యాయి. అనంతరం అప్పటి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ నిధులు మంజూరు చేయడంతో పాత ఆపరేషన్ థియేటర్‌ను పునరుద్ధరించి, అవసరమైన పరికరాలు, శస్త్రచికిత్స సామగ్రిని సమకూర్చి తిరిగి ప్రారంభించారు. నియోజకవర్గ సమీక్షలో స్థానిక ఎమ్మెల్యే సూచన మేరకు డిసిహెచ్ ఎస్ డాక్టర్ రవి బాబు ప్రత్యేక చొరవతో స్పెషాలిటీ సేవల భాగంగా గైనకాలజిస్ట్‌ను నియమించారు.ఆపరేషన్ థియేటర్ ప్రారంభమైన తర్వాత ఏడాది వ్యవధిలోనే వంద ట్యూబెక్టమీ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడం బుర్గంపాడు వంటి చిన్న ఆసుపత్రికి విశేషమని చెప్పవచ్చు. పది కిలోమీటర్ల దూరంలో 200 పడకల భద్రాచలం ఏరియా ఆసుపత్రి ఉన్నప్పటికీ, 30 పడకల బుర్గంపాడు ఆసుపత్రి సిబ్బంది తమ సేవలతో రోగుల విశ్వాసాన్ని సంపాదించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, శిశు వైద్య నిపుణులు డాక్టర్ ముక్కంటేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఈ సేవలు ప్రారంభమై, అనంతరం గైనకాలజిస్ట్ డా. అనూష లక్ష్మి ఆధ్వర్యంలో మరింత విస్తరించాయి.కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలతో పాటు సిజేరియన్ ఆపరేషన్లు, నార్మల్ డెలివరీలు, గర్భిణీ స్త్రీలకు అవసరమైన రక్తహీనత నివారణ సేవలు సహా పలు ప్రసూతి సేవలు అందుబాటులోకి వచ్చాయి.ప్రస్తుతం నిర్మాణంలో



ఉన్న కొత్త ఆసుపత్రి భవనం మరో నెల రోజుల్లో అందుబాటులోకి రానుండగా, స్కానింగ్ సేవలను కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు డీసీహెచ్ ఎస్ జి. రవి బాబు తెలిపారు.ఆపరేషన్ థియేటర్ ఇన్‌చార్జ్ నర్సింగ్ అధికారి ఎం. పద్మ, జ్యోతి, కరుణ శ్రీ, అనురాధ, రాజకుమారి, అనూష, నీలమ్మ, కవిత తదితరులు రోగులకు 24 గంటలపాటు సేవలు అందిస్తూ విశ్వాసాన్ని పెంపొందించారు. ప్రజల్లో నమ్మకం పెరగడంతో ఆసుపత్రికి రోగుల రద్దీ గణనీయంగా పెరిగింది.ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డి సి హెచ్ ఎస్ డా. రవి బాబు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరావు, డాక్టర్ అనూష లక్ష్మి, ఇతర సిబ్బంది కృషిని అభినందించారు.

## పిల్లల భద్రతకు తల్లిదండ్రుల జాగ్రత్తలు కీలకం

### దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు అవసరం

### కారేపల్లి ఎస్సై బైరు.గోపి



**టీ మీడియా,ఏప్రిల్28,సింగరేణి(కారేపల్లి):** వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కారేపల్లి ఎస్సై బైరు గోపి సూచించారు. ఈ కాలంలో పిల్లలు బావులు, చెరువులు, కాలువల వద్దకు ఈతల కోసం,సరదాల కోసం వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అలాంటి సందర్భాల్లో వారిని ఒంటరిగా పంపకూడదని చెప్పారు. చిన్న నిర్లక్ష్యమే ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.అలాగే సెలవులు, శుభకార్యాలకు బయటకు వెళ్లే వారు తమ ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచుకోవాలని తెలిపారు. అవసరమైతే ఇరుగుపొరుగువారికి సమాచారం ఇచ్చి ఇళ్లను పర్యవేక్షించేలా చూడాలని సూచించారు.అదనంగా, ప్రతి ఇంటి ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలను నివారించవచ్చని చెప్పారు.ప్రజల సహకారం ఉంటే అవాంఛనీయ సంఘటనలను పూర్తిగా అరికట్టవచ్చని ఈ సందర్భంగా ఎస్సై బైరు గోపి తెలిపారు.

## వాడవాడాల "మేడే"ను జరపండి

### -సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా



**టీ.మీడియా,ఏప్రిల్28 , రఘునాథపాలెం:** మే 1 ప్రపంచ కార్మిక దినోత్సవం అయిన "మేడే"ను వాడ, వాడాల నిర్వహించాలని, కార్మిక, కర్షక శ్రామిక వర్గాన్ని సంఘటితం చేయాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అమెరికా సామ్రాజ్య వాదులు తమ ఆధిపత్యం కోసం ఇరాన్ పై సాగిస్తున్న యుద్ధో న్మాదాన్ని టారిఫ్ ల పేరుతో ప్రపంచ దేశాలపై చేస్తున్న వాణిజ్య యుద్ధాన్ని కార్మిక వర్గం ఖండించాలన్నారు. అమెరికా ఎన్ని రకాలుగా భారత్ ప్రయోజనాలను, దాని సార్వభౌమధికారాన్ని ఎంతగా అవమానించిన, దెబ్బతీసిన నోరు మెదపకుండా లొంగుబాటును ప్రదర్శించి, మన జాతీయతను ట్రంప్ కు తాకట్టు పెట్టిన దీజీపీ –మోదీ ప్రభుత్వం వైఖరిని నిరసించాలన్నారు. అనేక త్యాగాలతో, పోరాటాలతో భారత కార్మిక వర్గం సాధించుకున్న చట్టబద్ధ, రాజ్యాంగ బద్ధ హక్కులను కాలరాస్తూ, శ్రామిక వర్గాన్ని కార్పొరేట్ పెట్టుబడి దారులకు, కట్టు బానిసలుగా మార్చే టందుకు తెచ్చిన 4 లేబర్ కోడ్ లను ప్రభుత్వం ఉపసంహరించుకునేలా, కార్మిక వర్గం గళం విప్పాలని అందుకోసం సమరశీల పోరాటాలకు, మేడే రోజున ప్రతిన బూనాలని నున్నా పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు కార్మిక, కర్షకు లందరూ వీధి,వీధినా ఎర్రజెండాలు ఎగురవేయాలని అరుణమయం చేయాలని పిలుపునిచ్చారు.



## మేమున్నాం స్వచ్ఛంద ద్వారా మజ్జిగ పంపిణీ

**టీ.మీడియా,ఏప్రిల్28 , సత్తుపల్లి:** మేమున్నాం సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాల్లో భాగంగా యోగ బృంద సభ్యుల సహకారంతో,వేసవి నేపథ్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు యోగా గురువు, సేవా సంస్థ నిర్వాహకుడు వెదుళ్ల వీరబాబు తెలిపారు.సత్తుపల్లి బస్టాండ్ సెంటర్ తో పాటు పాత సెంటర్లో దాదాపు 650 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కొంతమేరకు వారికి ఉపశమనం కలిగేందుకు ఈ మధ్యకి పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినామని, ప్రజలు కొంతమేరకు మజ్జిగ పంపిణీ వలన ఊరట చెందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగమణి, శైలజ, సునీత, అభిద్, ఇమామ్, నరసింహారావు పాల్గొన్నారు.

## మామిళ్లగూడెం మృత్యుఘోష..

పోస్టుమార్టం నివేదికలోనూ స్పష్టత రాకపోవడం గమనార్హం. దీంతో పోలీసులు మృతుల శరీర భాగాల నమూనాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు పంపించారు. కుటుంబ కలహాలా? లేక ఆర్థిక ఇబ్బందులా? అనే కోణంలో విచారణ జరుగుతోంది. దంపతులకు సంబంధించిన ఫోన్ కాల్ డేటాను పోలీసులు విశ్లేషిస్తున్నారు. రిపోర్ట్ వస్తేనే వారు విషప్రయోగం చేసుకున్నారా లేదా మరేదైనా జరిగిందా అనే విషయంలో స్పష్టత రానుంది.ఒకే కుటుంబంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం, మిగిలిన చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో మామిళ్లగూడెం విషాదంలో మునిగిపోయింది.




## నకిలీ బంగారంతో బ్యాంకు రుణం

**టీ.మీడియా,ఏప్రిల్28 , దమ్మపేట:** మండల పరిధిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణం పొందిన విషయంపై కలకలం రేగింది. పట్వారిగుడెంలోని తెలంగాణ గ్రామీణ బ్యాక్ లో నకిలీ బంగారంతాకట్టు పెట్టి ఈ మధ్యనే రెన్యువల్ సమయంలో అదే బంగారాన్ని వేరొకరి పేరుతో సుమారు ఏడున్నర లక్షలు రుణం తీసుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై నాగార్జున గ్రామీణ బ్యాంకు మేనేజర్ ను వివరణ కోరడానికి ప్రయత్నించగా మేనేజర్ సెలవు పై వెళ్ళారని బ్యాంకు సిబ్బంది తెలిపారు. ఈ విషయం జరిగి సుమారు వారం రోజులు కావస్తున్నా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.




## కార్యకర్తలు సైద్ధాంతిక అవగాహన కలిగి ఉండాలి

### -సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

**టీ.మీడియా,ఏప్రిల్28 , ఖమ్మం రూరల్ :** మార్క్సిస్టు కార్యకర్తలు సైద్ధాంతిక అవగాహన కలిగి ఉండాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవనంలో పాలేరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తలకు మంగళవారం స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ స్టడీ సర్కిల్ ను సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రారంభించారు. స్టడీ సర్కిల్ కు ముఖ్య అతిథిగా హాజరైన తమ్మినేని ప్రసంగిస్తూ.. ప్రతి మార్క్సిస్టు కార్యకర్త దేశ, అంతర్జాతీయ రాజకీయాలను నిరంతరం అధ్యయనం చేయాలని ప్రతి విషయంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మతోన్మాదులు అనేక రూపాలలో అబద్ధాలు, దుష్ప్రచారాలు, మాయమటలతో కార్యకర్తలను మానసికంగా ఇబ్బంది పెట్టేందుకు ఎన్నో కుటిల ప్రయత్నాలు చేస్తుంటారని వాటన్నిటిని తిప్పి కొట్టాలంటే నిరంతర అధ్యయనం ముఖ్యమని తెలిపారు.సైద్ధాంతికంగా బలంగా ఉన్నప్పుడే ఎన్ని ఆటుపోట్లయినా ఎదుర్కోవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరూ రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని యువత, మహిళలు రాజకీయాల్లోకి రావాలని, నిత్యం రాజకీయాలను పరిశీలించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఇరాన్ పట్ల అమెరికా, ఇజ్రాయెల్ వ్యవహరిస్తున్న తీరును వివరించారు. ఈ స్టడీ సర్కిల్లో సీపీఎం రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, స్టడీ సర్కిల్ కన్వీనర్ షేక్ బషీరుద్దీన్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉరడీ సుదర్శన్ రెడ్డి, నంద్ర ప్రసాద్, పలువురు పాలేరు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు .అభ్యర్థులను ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, భద్రతా తనిఖీల దృష్ట్యా అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు పైన తప్పనిసరిగా ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో అతికించుకోవాలని, అదనంగా మరో ఫోటోతో పాటు తాజా ఫోటో ఉన్న గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పర్సులు, వాచీలు, బెల్టు, చైన్లు, ఇయర్ రింగ్స్, బ్యాంగిల్స్, రింగులు వంటి వస్తువులు అనుమతించబడవని స్పష్టం చేశారు. అభ్యర్థులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు.పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163(బి) అమలు చేయాలని, కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని, ప్రశ్నాపత్రాల రవాణా మరియు పరీక్ష అనంతరం జవాబు పత్రాల భద్రత కోసం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.పరీక్షా రోజున విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా కల్పించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ వంటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ పరీక్ష విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైనదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, పాల్వంచ సీఐ సతీష్, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, కలెక్టరేట్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, నీట్ పరీక్ష ఇంచార్జ్ ప్రసాద్, పరీక్షా కేంద్రాల సూపరిండెంట్లు, తాసిల్దారులు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, విద్యుత్ శాఖ అధికారులు,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## తుమ్మల నివాసంలో పూర్వ మిత్రుల కలయిక

**టీ.మీడియా,ఏప్రిల్28 , దమ్మపేట:** మండల పరిధి గండుగులపల్లి లోని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసంలో మంగళవారం పలు ప్రాంతాలకు చెందిన ఆయన పాత మిత్రులు, సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పాల్వంచ, పినపాక, వేంసూర్, భద్రాచలం, కల్లూరు ప్రాంతాల నుండి మంత్రి మిత్రులు భవాని శంకర్, కిలారి నాగేశ్వరరావు, వెల్ది జగన్ మోహన్, సంజీవ్ రెడ్డి తదితరులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తమ ఉమ్మడి రాజకీయ ప్రస్థానం, పాత మిత్రుల యోగక్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత పాత మిత్రులను కలుసుకోవడం పట్ల మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేశారు. ఆయా నియోజకవర్గాల్లోని తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై వారితో ప్రత్యేకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాద్ తదితరులు ఉన్నారు.




## ఎయిర్‌టెల్ సిమ్ తీసుకుంటే..

### లీటర్ పెట్రోల్ ఫ్రీ

**టీ.మీడియా, ఏప్రిల్28 , దమ్మపేట** :రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ కొరత నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్‌టెల్ ప్రతినిధులు వినూత్న ఆఫర్ ఇచ్చారు. తమ దగ్గర సిమ్ తీసుకుంటే లీటర్ పెట్రోల్ ఇస్తామని బంపరాఫర్ ప్రకటించారుతెలుగు రాష్ట్రాల్లో కృత్రిమ ఇంధన కొరతతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బంక్‌ల వద్ద నో స్టాక్ బోర్డులు పెడుతుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తెరచివున్న బంక్‌ల వద్ద క్యూ కట్టి మరీ పెట్రోల్ పట్టించుకుంటున్నారు. ఈ క్రమంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో ఎయిర్‌టెల్ ప్రతినిధులు రంగంలోకి దిగారు. ఈ సంక్షోభాన్ని క్యాష్ చేసుకుంటూ.. మా దగ్గర సిమ్ తీసుకుంటే చాలు.. లీటర్ పెట్రల్ ఫ్రీగా ఇస్తామని బంపరాఫర్ ప్రకటించారు.కొత్త కనెక్షన్ అయినా సరే.. లేదా వేరే నెట్‌వర్క్ నుంచి ఎయిర్‌టెల్‌కు మారినా సరే.. రూ.350 రీచార్జ్‌తో పాటు ఒక లీటర్ పెట్రోల్‌ను ఉచితంగా ఇస్తున్నారు. కస్టమర్లను పెంచుకునేందుకు ఎయిర్‌టెల్ ప్రతినిధులు ఫాలో అవుతున్న ట్రిక్ ఇప్పుడు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటుంది.



## అనుమతి లేని పాఠశాల మూసివేత

**టీ.మీడియా,ఏప్రిల్28 ,తిరుమలయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీరామ విద్యాలయాన్ని మంగళవారం విద్యాశాఖ అధికారులు మూసివేశారు. గత ఆరేళ్లుగా పాఠశాల అనుమతిని రెన్యువల్ చేసుకోకపోవడం వల్ల పాఠశాల యజమాని మర్రి శ్రీనివాస్ రెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. అయినా స్పందన లేకపోవడంతో మంగళవారం పాఠశాలను సీజ్ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి వెల్లడించారు. పాఠశాలను సీజ్ చేసి రికార్డులను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.